

వీధి కుక్కల దాడిలో బాలుడి మృతిపై మానవ హక్కుల కమిషన్ సీరియస్

మెదక్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బిస్కెట్లు కొనుగోలు చేసేందుకు షాపునకు వెళ్లిన చిన్నారి నితిన్‌పై వీధి కుక్కలు దాడి చేసి, చంపేసిన ఘటనను మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. దీనిపై సుమోటోగా కేసు నమోదు చేసింది. 2020 నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రంలో వీధి కుక్కల దాడిలో మరణించిన వారి వివరాలను సమర్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యల నివేదికనూ సమర్పించాలని నిర్దేశించింది.



మార్కెట్‌కు తరలించడానికి ఉల్లి నారును తీస్తున్న మహాదేవ్‌పల్లి మహిళలు

ఏ ఊరి సంతలోనైనా.. ఈ ఊరి కూరగాయలే..!

మహాదేవ్‌పల్లి స్పెషల్

- తరతరాలుగా కూరగాయల సాగు
- నాలుగు జిల్లాల వారంతపు సంతల్లో విక్రయం
- శుభకార్యాలంటే ఇక్కడకు రావాల్సిందే
- ఉల్లినారులో తెలంగాణలోనే టాప్

7



కల్హేర్ వారాంతపు సంతలో కూరగాయలు విక్రయిస్తున్న మహాదేవ్‌పల్లి రైతులు

మహాదేవ్‌పల్లి.. ఊరు చిన్నదే అయినా.. చుట్టుపక్కల నాలుగు జిల్లాల్లో ఈ పేరు తెలియని వారుండరు. ఊరు ఏదైనా ఇక్కడి కూరగాయలే అమ్ముతారు. జనం కూడా అంతే ఇష్టంగా ఇక్కడి కూరగాయలను కొనుగోలు చేస్తారు. తరతరాలుగా కూరగాయలను సాగు చేస్తూ సుమారు నాలుగు జిల్లాల్లో ఇక్కడి వారు పండించిన పంట లేని వారంతపు సంతలు జరగవంటే అతిశయోక్తి కాదు. బంగారు పంటలు పండే ఈ భూమిని గ్రామస్థులు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించరు. ఏళ్లుగా.. తాతల.. తండ్రుల కాలం నుంచి భూములు వారి వద్దే ఉన్నాయి. పిల్లలు చదువుల కోసం బయటికి వెళ్లినా.. పెద్దలంతా కూరగాయాల సాగు చేస్తారు. ఒక వేళ ఇక్కడి భూములు ఎవరైనా విక్రయానికి పెడితే కొనేందుకు పోటీ ఉంటుంది.

-కల్హేర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి)

అట్టహాసంగా సాగిన దుర్గమ్మతల్లి జాతర ఉత్సవాలు

ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్న జగ్గారెడ్డి



సంగారెడ్డిలో దుర్గమ్మ జాతర ఉత్సవాల్లో స్టెప్పులేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో దుర్గమ్మతల్లి జాతర ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. భక్తి శ్రద్ధలతో వేలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని కింది బజార్ నలందనగర్‌లో ఉన్న దుర్గామాత ఆలయం వద్ద వారం రోజులుగా సాగుతున్న ఈ జాతరలో భాగంగా ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంగారెడ్డితో పాటు చుట్టుపక్క గ్రామాల మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి భక్తులు, కార్యకర్తలు, పోతురాజులు, కళాకారులతో కలిసి కొరడా ఝులిపించి తీన్మార్ స్టెప్పులతో అదరగొట్టారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుంటున్నానని తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని రైతులు, ప్రజలు సంతోషంగా ఉండేలా దీవించాలని అన్నారు. వేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ ఆలయం వద్ద మాట్లాడుతున్న జగ్గారెడ్డి

చదువుల 'తల్లి'



ఈ చిత్రంలో కనిపిస్తున్న చదువుల 'తల్లి' పేరు శోభ. మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని వెంక్యతండాకు చెందిన ఆమెకు ఇద్దరు పిల్లలు. డిగ్రీ వరకు చదువుకుంది. వ్యవసాయ కుటుంబం. పొలం పనులతో బిజీగా ఉన్నా పిల్లల చదువులను మాత్రం నిర్లక్ష్యం చేయదు. బడి నుంచి పిల్లలు ఇంటికి వచ్చిన తరువాత దగ్గరుండి చదివిస్తుంది. పాడి పశువులను పొలానికి మేతకు తోలుకు వెళ్లినా... ఇలా పిల్లలను దగ్గరు కూర్చోబెట్టుకుని హోంవర్క్ చేయిస్తున్నది. చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందని చెబుతున్నది.

-శివ్వంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి)

నమ్ముకున్న స్నేహితులే **శత్రువులై..**

అప్పు తీర్చినా వేధింపులు
మనోవేదనతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య
మేడ్చల్‌లో ఘటన

6

'సిగాచి'ని సందర్శించిన **ఏపీ ఫైర్ సేఫ్టీ డీజీ**

7

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై **రాష్ట్ర బృందం ఆరా**

7

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ అరుణ బాయి ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, తెలుగు, వృక్షశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, ఇంగ్లిష్, రాజనీతిశాస్త్రం, చరిత్ర సబ్జెక్టు పోస్టులు ఖాళీలుగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 22 వ తేదీలోగా సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● జోగిపేట: జోగిపేట పట్టణంలోని నెహ్రూ స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పీ. రమేశ్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ కంప్యూటర్ సైన్స్ పోస్టుకు రెండు, ఇంగ్లిష్-2, తెలుగు-2 పొలిటికల్ సైన్స్-1, హిస్టరీ-1, ఎకానమిక్స్-1 జువాలజీ-1 పోస్టులు చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 22న సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో అందజేయాలని సూచించారు.

● నారాయణఖేడ్: నారాయణఖేడ్ మోడల్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ కోరారు. ఇంగ్లిష్, కెమిస్ట్రీ, జుయాలజీ, కంప్యూటర్ సైన్స్, హిస్టరీ, కామర్స్, తదితర సబ్జెక్ట్‌లను బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఈనెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9182793926 నెంబరులో సంప్రదించాలన్నారు.

పంటకు ఊపిరి.. రైతుకు ఊరట

పలకరించిన వర్షం

- వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ
- పుల్కల్‌లో 112 మి.మీ.
- సింగూరు ప్రాజెక్టుకు 2,658 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



చౌటకూర్‌లో పత్తి పైరుకు యూరియా వేస్తున్న రైతులు

నర్సాపూర్/ఝరాసంగం/పుల్‌కల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి సరిపడా వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతన్నకు ఊరట లభించింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోశాయి. వానాకాలం సీజన్‌లో వేసుకున్న పత్తి, సోయాబీన్, కంది, పెసర, మినుము, జొన్న తదితర పంటలకు ఈ వర్షాలతో కొంత మేలు జరిగింది. సీజన్ ప్రారంభంలో వర్షాలు కురిసినా.. విత్తనం వేసుకున్న తరువాత ముఖం చాటేయడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాలు కురువాలంటూ గ్రామాల్లో ప్రజలు పూజలు చేశారు. ఓవైపు మొలిచిన మొక్కలు వాడు ముఖం పడుతుండగా.. ఎరువులు వేసుకోవడానికి కూడా తడి లేకుండాపోయింది. ఈ తరుణంలో మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని పలు మండలాల్లో రెండ్రోజులుగా వర్షాలు కుస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలోనే అత్యధికంగా పుల్కల్ మండలంల 112 మిల్లీ మీటర్లు, లక్ష్మీసాగర్ ప్రాంతంలో 73 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో రైతులు పంటకు ఎరువులు వేసుకుంటున్నారు. వరి నాట్లకు దమ్ము చేస్తున్నారు. మరోవైపు సింగూరు ప్రాజెక్టులోకి 2,658 క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. ప్రస్తుతం 521.120 మీటర్ల వద్ద 18.447 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. నర్సాపూర్‌లో రోడ్లు జలమయమయ్యాయి. ఝరాసంగం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ప్యాలవరం వాగు వద్ద అధికారుల బారికేడ్లు ఏర్పాటు చేశారు.

అక్కడ కుండపోత.. ఇక్కడ ఉక్కపోత

కల్హేర్/సిర్గాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కల్హేర్ మండలంలో చినుకు జాడ లేకపోవడంతో రైతులు కలత చెందుతున్నారు. చుట్టుపక్కల మండలాల్లో భారీ వర్షం కురిసినా ఇక్కడ మాత్రం పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నారు మడులను కాపాడుకోవడానికి ట్యాంకర్లతో నీరు పెడుతున్నారు. వర్షాల కోసం మండల పరిధిలోని కడ్పల్ గ్రామస్థులు చుట్టుపక్కల 11 గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఖానాపూర్(కె)లో ట్యాంకర్‌తో నారుమడికి నీరు



సంగారెడ్డిలోని డీఈవో ఆఫీసు

సర్దుబాటు.. తడబాటు!

- ఉపాధ్యాయుల బదిలీల్లో జాప్యం
- ఇంకా కొలిక్కిరాని ప్రక్రియ
- ఫైలు వెనక్కి పంపిన కలెక్టర్!
- మార్పులపై విద్యాశాఖ కసరత్తు
- వచ్చే వారమైనా ఉత్తర్వులు వెలువడేనా?

సంగారెడ్డి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటులో జాప్యం కొనసాగుతున్నది. ఈ నెల 15వ తేదీ లోపు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. కానీ, సంగారెడ్డి జిల్లాలో ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన ఫైలును విద్యాశాఖ అధికారులు మూడు రోజుల క్రితమే కలెక్టర్ ఆమోదానికి పంపించారు. అయితే, సర్దుబాటు జాబితాలో కొన్ని పొరపాట్లను గుర్తించిన కలెక్టర్ మరోసారి పరిశీలించాలని ఫైలును వెనక్కి పంపినట్టు తెలిసింది. అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో, డీఈవోతో కూడిన కమిటీ మరోసారి చర్చించి తుది జాబితా పంపాలని సూచించినట్టు సమాచారం. అయితే టీచర్ల సర్దుబాటు ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా అదే మండలాల్లో కాకుండా పలువురు టీచర్లను అనుకూలంగా ఉన్న పాఠశాలకు సర్దుబాటు చేసేలా జాబితాలో చేర్చినట్టు తెలిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి పెద్ద సంఖ్యలో 352 మందితో కూడిన సర్దుబాటు జాబితాను సిద్ధం చేయడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలోనే కలెక్టర్ ఫైలును వెనక్కి పంపించడంతో విద్యాశాఖ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. నేడు, రేపు వరుస సెలవుల నేపథ్యంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మరో రెండు, మూడు రోజులు పట్టే అవకాశం ఉందని విద్యాశాఖ అధికార వర్గాలు తెలిపాయి.

విద్యాబోధనకు ఆటంకం

మరోవైపు ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో కూడా జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు చేయకపోవడంతో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతుందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఐఐటీ హెచ్‌లో 'స్నాతకోత్సాహం'

1,273 మంది విద్యార్థులకు పట్టాలు

- నలుగురికి గోల్డ్, 44 మందికి సిల్వర్ మెడల్స్
- ఒకరికి రాష్ట్రపతి బంగారు పతకం
- అంబరాన్నంటిన సంబరాలు
- కేరింతలతో మార్మోగిన ఐఐటీహెచ్ ప్రాంగణం
- ముఖ్య అతిథిగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్

7



విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్



ఐఐటీహెచ్‌లో 'స్నాతకోత్సాహం' వెలకొంది. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ 14వ స్నాతకోత్సవం సందర్భంగా శనివారం సంబరాల్లో మునిగిపోయింది. 1,273 మంది విద్యార్థులు పట్టాలను అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్వదేశీయత ఉట్టిపడేలా విద్యార్థులు పోచంపల్లి చేనేత వస్త్రాల్లో అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హాజరయ్యారు.

నల్లవాగు ప్రాజెక్టులో కబ్జాలపై కొరడా

మట్టి కట్టల తొలగింపు.. కేసుల నమోదుకు చర్యలు

కల్హేర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నల్లవాగు ప్రాజెక్టులో కబ్జాలపై అధికారులు కొరడా ఝులిపించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో పొలాలుగా మార్చడానికి వేసిన మట్టి కట్టలను నీటిపారుదలశాఖ అధికారులు శనివారం తొలగించి చదును చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తలకు స్పందించిన అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఎఫ్‌టీఎల్‌లో కబ్జాలు జరిగినట్లు గుర్తించారు. ఇరిగేషన్ డీఈఈ పవన్‌కుమార్, ఏఈలు మల్లేష్, శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి కట్టలను తొలగించారు. కబ్జాలకు పాల్పడిన వారిపై కేసుల నమోదుకు చర్యలు చేపట్టారు.



నల్లవాగు ప్రాజెక్టులో మట్టి కట్టలను తొలగిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంఏ తెలుగు ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణ

● తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఎంఏ తెలుగు ఎంట్రెన్స్ రాయబోతున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష మెళకువల కోసం శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. సిద్దిపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న కాలేజీలలో డిగ్రీ చదివి ఎంఏ తెలుగుపట్ల ఆసక్తితో ప్రవేశ పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. తెలుగు విభాగం అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ తరగతులను నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తెలుగు విభాగంలో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

సంగారెడ్డి పోలీసుల పనితీరు భేష్


పట్టణ పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పనితీరు బాగుందని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్‌లను పరిశీలించారు. సిబ్బందికి అందించిన కిట్లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ పరిశీలించి పట్టణ సీఐ రమేష్‌ను అభినందించారు. ఎస్పీ వెంట డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, విజయ్‌పవార్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలు

● నిధుల రికవరీకి ఆదేశం

పెద్దశంకరంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనుల్లో మండలంలో అవినీతి చోటు చేసుకుందని అడిషనల్ డీఆర్డీవో రంగాచారి వెల్లడించారు. మండలంలోని ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ క్రమంలో పలు అక్రమాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో రూ.లక్షా 23వేల195 రికవరీకి ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు, సంబంధిత అధికారులకు రూ. 33 వేల జరిమానా విధించారు. బద్దారం, జూకల్, కమలాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నందున వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవీవో శ్రీహరి, హెచ్‌ఆర్.రాజు, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి అంజాగౌడ్, ఎంపీడీవో షాకీర్‌అలీ, ఏపీవో సంతోష్‌కుమార్, ఈసీ నవాజుద్దీన్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

27లోగా సీఎంఆర్ ఇవ్వకుంటే చర్యలు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


నర్సాపూర్ సమీపంలోని సాయికృష్ణ మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ తదితరులు

నర్సాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మిల్లర్లు ఈ నెల 27వ తేదీలోపు సీఎంఆర్ ఇవ్వని పక్షంలో చర్యలు తప్పవని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. శనివారం నర్సాపూర్ సమీపంలోని సాయికృష్ణ రైసుమిల్లును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానందం, అసిస్టెంటు సివిల్ సప్లై అధికారి అబ్దుల్ నిసార్‌లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 67 మిల్లులకు 2,52,013 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించామని, మిల్లర్లు 1,70,791 మెట్రిక్ టన్నుల బియ్యానికిగాను 1,64,826 మెట్రిక్ టన్నుల బియ్యం ఇప్పటికే మిల్లింగ్ చేసి ఇవ్వగా, ఇంకా 5,965 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ తదితరులు ఉన్నారు.

నమ్ముకున్న స్నేహితులే శత్రువులై..

● అప్పు తీర్చినా వేధింపులు
● మనోవేదనతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య
● మేడ్చల్‌లో ఘటన


కాముని రమేశ్ (ఫైల్)

మెదక్ అర్బన్/ మేడ్చల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తాను ఎంతగానో నమ్మిన తన స్నేహితులు శత్రువులుగా మారి డబ్బు కోసం వేధిస్తుండటంతో మెదక్‌లో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నారు. తాను ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన వారి పేర్లను సెల్ఫీ వీడియోలో పేర్కొని ఉరేసుకొని మృతిచెందారు. మెదక్ పట్టణానికి చెందిన కాముని రమేశ్ (52) హవేళీఘణపూర్ మండలంలోని సర్దన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన గతంలో చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. వ్యాపారానికి అవసరమైన నగదును తన స్నేహితుల వద్ద అప్పుగా తీసుకున్నారు. వ్యాపారంలో నష్టం వచ్చింది. మరోవైపు తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగాయి. దాంతో తన ఇల్లు, స్థలాలు, బంగారాన్ని అమ్మేసి అప్పులు తీర్చారు. అయితే డబ్బులు తీసుకున్న తర్వాత కూడా ఆయన స్నేహితులు కొందరు చెక్ బౌన్స్ కేసులు వేయడంతోపాటు, ప్రామిసరీ నోట్‌లు, ఖాళీ చెక్కులను అడ్డుపెట్టుకుని వేధింపులకు గురి చేశారు. దాంతో తీవ్ర మనోవేదనకు లోనయ్యారు. ఈ మధ్య కాలంలో తనను చంపుతామంటూ వారు బెదిరిస్తుండటంతో మరింత ఆందోళనకు గురయ్యారు. శనివారం మేడ్చల్‌లోని ఓ లాడ్జిలో సెల్ఫీ వీడియోలో తన చావుకి కారణమైన తన మిత్రుల పేర్లను పేర్కొని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. సీఎం రేవంత్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన భార్య, పిల్లలను ఆదుకోవాలని రమేశ్ వీడియోలో కోరారు. కష్టకాలంలో తనకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, చైర్మన్, వైస్ చైర్మన్ చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ కృష్ణారెడ్డి మద్దతుగా నిలిచారని ఆయన వీడియోలో పేర్కొపారు.

జిల్లాలో మూసివేసిన పాఠశాలలు పునఃప్రారంభం

● మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్


ప్రాథమిక పాఠశాలలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న డీఈవో

వెల్దుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూసివేసిన మూడు ప్రాథమిక పాఠశాలలను ఈ ఏడాది పునఃప్రారంభించినట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. శనివారం వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఎంఈవో యాదగిరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వెల్దుర్తి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్లపై ఆగ్రహం


సమావేశంలో వాగ్వివాదం చేసుకుంటున్న బీఆర్‌పీ, టెక్నికల్ అసిస్టెంట్లు

జహీరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లపై డీఆర్‌డీవో ఏపీడీ బాల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోగా, ఏపీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు సుధాకర్, మంజుల, విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, బోజిరెడ్డి, ఏపీవో రాజ్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 40 మంది క్రీడాకారుల ఎంపిక


అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మెదక్ అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 11వ తెలంగాణ స్టేట్ జూనియర్స్ సీనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జిల్లాస్థాయి పోటీలు శనివారం స్థానిక స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి పోటీలను డీఈవో రాధాకిషన్‌జెండా ఊపి ప్రారంభించారు. అండర్- 14,16,18 బాల బాలికలకు రన్స్, త్రో, జంప్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు వచ్చేనెల 3, 4వ తేదీల్లో వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వెంకటరమణ, మధుసూదన్ తెలిపారు.

నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం

రామచంద్రాపురం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో వర్షపునీరు నిల్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి అన్నారు. శనివారం భారతీనగర్ డివిజన్ పరిధి ఎల్‌ఐజీ కాలనీలో జరుగుతున్న వరద కాలువ నిర్మాణ పనులు కాలనీవాసులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వర్షాలు కురిసిన సందర్భాల్లో నీరు రోడ్లపై పారుతున్నాయని చెప్పారు. దీని వల్ల వర్షపునీరు ఇళ్లల్లోకి తరచూ చేరుతున్నాయని వివరించారు. శాశ్వత పరిష్కారం లభించే విధంగా వరదకాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ దేవేందర్, ఏఈ ఫైజాన్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, సామ్యూల్, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడిన ఇద్దరికి రిమాండ్


అటవీశాఖ అధికారుల అదుపులో ఉన్న నిందితులు

నర్సాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ అటవీరేంజ్ పరిధిలో వన్యప్రాణులను వేటాడిన కేసులో ఇద్దరిని అదుపులో తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్‌ఆర్‌వో అరవింద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకట్రావ్‌పేట సమీపంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల వేటాడుతుండగా అటవీ అధికారుల పెట్రోలింగ్‌లో రమేష్, రామ్‌ను పట్టుకున్నామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సెక్షన్ అధికారులు సాయిరాం, కరీముద్దీన్, బీట్ అధికారులు మౌనికతో పాటు పలువురు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం


రాములు(ఫైల్)

నర్సాపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన భర్త అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ లింగం వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పానుగంటి రాములు శుక్రవారం భార్య పోచమ్మతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రివరకు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనపడి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చౌటకూర్‌లో మేకలు చోరీ

పుల్‌కల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకూర్‌లో శుక్రవారం రాత్రి నాలుగు మేకలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన కొన్యాల గుండయ్య మేకలు మేపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం మేకలను ఇంటి ముందు గల షెడ్డులో కట్టేసి నిద్రపోయాడు. దుండగులు షెడ్డులోకి చొరబడి రూ.60 వేల విలువ గల నాలుగు మేకలను ఎత్తుకెళ్లారు. గతేడాది కూడా గుండయ్యకు చెందిన నాలుగు మేకలను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడు పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత


టిప్పర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొండపాక, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మక్కపల్లి చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, హిటాచీని కుకునూరుపల్లి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన పర్వతం సాయి, కొండపాకకు చెందిన కొంచెం సురేష్, బోదాసు ప్రశాంత్, శ్యాంసుందర్‌గుప్తా, సిద్దిపేటకు చెందిన దర్శనం ప్రవీణ్ అనుమతులు లేకుండా దమ్మకపల్లిచెరువు నుంచి మట్టి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ కుకునూరుపల్లి పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి, మట్టి తరలిస్తున్న టిప్పర్లను హిటాచీని స్వాధీనం చేసుకున్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ


ఆలయాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ సదాత్‌మియా

వెల్దుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం పగులగొట్టిన గుర్తుతెలియని దుండగుడు గర్భగుడిలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన రూ.1500 నగదును అపహరించాడు. పూజారి భక్తులు అందించిన చిల్లర(నగదు)ను గర్భగుడిలోని చెక్కపెట్టెలో దాచి ఉంచగా వాటిని తస్కరించాడు. శనివారం ఉదయం రోజు మాదిరిగా పూజలు నిర్వహించడానికి వచ్చిన పూజారి తాళం ధ్వంసం చేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏఎస్సై సదాత్‌మియా సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

సమాజాన్ని అప్రమత్తం చేసేలా వార్తలుండాలి

● సిద్దిపేట కలెక్టర్ హైమావతి



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సిద్దిపేట కల్చరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అధికారులను అప్రమత్తం చేసేలా ప్రజలను చైతన్యపరిచేలా వార్తలుండాలని సిద్దిపేట కలెక్టర్ హైమావతి సూచించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో రెండురోజులుగా జరుగుతున్న విలేకరుల పునశ్చరణ తరగతుల ముగింపునకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలాంటి వారు జర్నలిస్టులని అని అన్నారు. అంతకుముందు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక యుగంలో జర్నలిజంలో చరిత్రాత్మకమైన మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. నైతిక నియమావళి, మీడియా చట్టాలు అనే అంశంపై ప్రసంగించారు. జర్నలిజం గతం వర్తమానం భవిష్యత్ మీడియా ధోరణులు, అధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పులు అనే అంశంపై ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్ ప్రసంగించారు. ఆధునిక మీడియాలో మంచి, చెడు రెండు ఉన్నాయని, కొంతమంది వ్యక్తుల అవలక్షణాలను వ్యవస్థకు ఆపాదించి తప్పు పట్టవద్దని సూచించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అనే అంశంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జయదేవ్ మాట్లాడారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం అమలు తీరును వివరించారు. తాజాగా వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలిపారు. రెండురోజులు శిక్షణా తరగతులకు హాజరైన విలేకరులకు సర్టిఫికెట్లను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాందాపూర్‌లో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న సుమలత

అల్లాదుర్గం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు సుమలత అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే-2025లో భాగంగా అల్లాదుర్గం మండలంలోని మాందాపూర్, చిల్వెర్, ఐబీ గిరిజనతండా తదితర గ్రామాల్లో ఆయా శాఖల అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. పారిశుధ్య నిర్వహణలో తడి, పొడి చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, వీధిదీపాల ఏర్పాటు తదితర అంశాలతో పాటు అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రత నిర్వహణపై పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీవో సుధాకర్, ఎంపీవో లింగప్ప, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాములు, జనార్ధన్, గణేష్, రేణుక, నాగరాజు, అనిత, స్వరూప, ఈజీఎస్ టీఏ జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

● ఎమ్మెల్యే ఫొటోను ఫ్లెక్సీపై పెట్టకపోవడంపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం



వేదికపై ఉన్న ఫ్లెక్సీని చింపివేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్,జూలై 19(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని సెట్విన్ కార్యాలయం వద్ద శిక్షణను పూర్తిచేసుకున్న పలువురు లబ్ధిదారులకుఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి నేతృత్వంలో సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అయితే వేదికపై ఎమ్మెల్యే మాణిక్‌రావు ఫొటోను పెట్టకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. సెట్విన్ సంస్థ చేపట్టే కార్యక్రమం ప్రైవేటు కాదన్నారు. ఇలా అధికారులు, నాయకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, ఎమ్మెల్యే మాణిక్‌రావును అవమానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ శ్రేణులు వేదికపై ఉన్న ఫ్లెక్సీని చింపివేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. సెట్విన్ సంస్థ పనితీరును తప్పుపడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ మశ్చేందర్, బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టునారాయణ, నాయకులు నామకిరణ్, రవికిరణ్, వెంకటేష్, హీరు రాథోడ్, జగదీశ్వర్, గణేష్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.





కందిలోని ఐఐటీహెచ్ 14వ స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఐఐటీహెచ్ అధ్యాపక బృందంతో అశ్విని వైష్ణవ్

ఐఐటీహెచ్‌లో 'స్నాతకోత్సాహం'

- 1,273 మంది విద్యార్థులకు పట్టాలు
- నలుగురికి గోల్డ్, 44 మందికి సిల్వర్ మెడల్స్
- ఒకరికి రాష్ట్రపతి బంగారు పతకం
- అంబరాన్నంటిన సంబరాలు
- కేరింతలతో మార్మోగిన ఐఐటీహెచ్ ప్రాంగణం
- ముఖ్య అతిథిగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్

కంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో 14వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హాజరయ్యారు. ఐఐటీ-హెచ్‌లోని బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీలలోని వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 1,273 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. పట్టాలు పొందిన విద్యార్థుల్లో రాహుల్ రామచంద్రన్ (ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్ మెడల్), రిషిత ముదునూరి(బీటెక్), హర్మన్‌ప్రీత్(ఎంఎస్సీ), అజిత్ బీఎస్(ఎంటెక్) గోల్డ్ మెడల్స్ సాధించారు. 44 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారు. బీటెక్‌లో 460, బీడీఎస్‌లో 20, ఎంఏలో 11, ఎంఎస్సీలో 98, ఎండీఎస్‌లో 33 మంది, ఎంటెక్‌లో 511 మంది, ఎంఫిల్‌లో ఒకరు, ఎంఎస్ బై కోర్స్‌వర్క్‌లో నలుగురు, ఎంఎస్ రీసెర్చ్‌లో ఒకరు, పీహెచ్‌డీలో 134 మందితో కలిపి మొత్తం 1,273 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో స్నాతకోత్సవానికి హాజరయ్యారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. ఐఐటీ-హెచ్ జపాన్ సహకారంతో ఎన్నో అద్భుతమైన ప్రాజెక్టును చేపట్టిందని ఆయన తెలిపారు. 5జీ, 6జీ టెక్నాలజీతో పాటు పలు రంగాల పరిశోధనల్లో ఐఐటీ-హెచ్ కీలకపాత్ర పోషిస్తున్నన్నారు. ప్రపంచంలో భారతదేశం అద్భుత పురోగతి సాధిస్తున్నదని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందడంలో యువశాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. వేడుకల సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సందేశాన్ని, సంస్థ సాధించిన ప్రగతిని, పరిశోధనల గురించి వివరించారు. అనంతరం ఐఐటీహెచ్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐటీహెచ్ ప్రారంభించి దశాబ్దకాలంగా ఎదిగిన తీరును వివరించారు. భవిష్యత్‌లో ఐఐటీహెచ్ నెంబర్‌వన్ స్థానంలో నిలవడం ఖాయమన్నారు. గతేడాది నుంచి ఐఐటీహెచ్‌లో ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, ఆన్‌లైన్ ఎంటెక్ ప్రోగామ్‌లకు తొలిసారిగా గ్రాడ్యుయేట్ బ్యాచ్ పట్టాలు పొందడం హర్షనీయమన్నారు.

ఉట్టిపడిన స్వదేశీయత

స్నాతకోత్సవానికి విద్యార్థులు, ప్రొఫెసర్ల బృందం పోచంపల్లి చేనేత వస్త్రాలతో హాజరవ్వడంతో స్వదేశీయత ఉట్టిపడింది. ఇప్పటివరకు ఐఐటీహెచ్‌లో నిర్వహించిన ప్రతీ స్నాతకోత్సవానికి పోచంపల్లి చేనేత వస్త్రాలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఐఐటీహెచ్ లోగో ముద్రించిన ఎరుపు, నారింజ, ఊదా, ఆకుపచ్చ, నీలం రంగు స్కార్ఫ్‌లతో విద్యార్థులు ఖద్దరు లాల్చి, పైజామాలు ధరించగా, విద్యార్థినులు చేనేత చీరకట్టుతో చూపరులను ఆకట్టుకున్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

పట్టాలు పొందిన విద్యార్థుల సంబరాలు అంబరాన్నంటాయి. పట్టాలు స్వీకరించిన అనంతరం ముఖ్యఅతిథి, ప్రొఫెసర్లతో గ్రూపు ఫొటోలు తీసుకున్నారు. పట్టాలు చూపుతూ, స్కార్ఫ్‌లను గాల్లో ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పట్టాలు పొందిని ఆనంద క్షణాలను తమ తల్లిదండ్రులతో కలిసి సెల్‌ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. దీంతో ఐఐటీహెచ్ ప్రాంగణమంతా విద్యార్థుల కేరింతలతో మార్మోగింది.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్థానిక సంస్థల కార్యశాలలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు అండగా ఉండి పోరాడాలన్నారు. తాను కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎంపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, గంగాడి మనోహర్‌రెడ్డి, దూది శ్రీకాంత్‌రెడ్డి, వంగ రామచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి,చింత సంతోష్, తుంగ కనకయ్య, వెంకటరమణ, కప్పర ప్రసాద్, గుండ్ల జనార్ధన్, రాంరెడ్డి, బాసంగారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

చిన్నకోడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మనోహరాబాద్ - కొత్తపల్లి రైల్వే లైన్ మార్గంలోని చిన్నకోడూరులో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. శనివారం హైదరాబాద్‌లో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చిన్నకోడూరుకు రంగనాయకసాగర్ రిజర్వాయర్ సమీపంలో ఉండటం వల్ల ఈ ప్రాంతంలో రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు, ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి తెలిపారు.

నిరంతర అభ్యాసంతో కృత్రిమ మేధపై పట్టు

- నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కార్నిక్
- గీతం 16వ స్నాతకోత్సవం
- 2002 మందికి పట్టాలు.. 32 మందికి బంగారుపతకాలు



డాక్టర్ కిరణ్ కార్నిక్, శ్రీభరత్ చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకుంటున్న సాహితీ

పటాన్‌చెరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు యుగంలో నిరంతర అభ్యాసం అవశ్యమని, తద్వారా యువతకు దానిపై పట్టు సాధించే వీలు కలుగుతుందని నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కార్నిక్ ఉద్బోధించారు. గీతం హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం వర్సిటీ 16 స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ పట్టభద్రులైన వారంతా ఉన్నత లక్ష్యాలతో తమ కలలను నిజం చేసుకోవాలని సూచించారు. గీతం వీసీ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా మాట్లాడారు. స్నాతకోత్సవంలో భాగంగా 32 మందికి బంగారు పతకాలు అందించారు. మొత్తం 2002 మందికి డిగ్రీలు, 100 మందికి పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు ప్రదానం చేశారు.

ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు

ముగ్గురు విశిష్ట వ్యక్తులకు గీతం గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసింది. కల్పకంలోని ఇందిరాగాంధీ అణు పరిశోధనా కేంద్రం (ఐజీసీఏఆర్) పూర్వ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రామన్ భారతదేశ రక్షణ, అంతరిక్ష సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో అణు ఇంజనీరింగ్, విధ్వంసక రహిత మూల్యాంకనంలో మార్గదర్శక కృషికిగాను డాక్టర్ ఆఫ్ సైన్స్ (డీఎస్సీ)ని అందుకున్నారు. ప్రఖ్యాత సామాజిక వ్యవస్థాపకుడు, తక్కువ ఖర్చుతో కూడిన శానిటరీ ప్యాడ్ తయారీ యంత్రాన్ని కనుగొన్న ప్యాడ్ మాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన అరుణాచలం మురుగనాథంకు డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డీలిట్) ప్రదానం చేశారు. భారతదేశ మౌలిక సదుపాయాల రంగంలో మార్గదర్శక శక్తిగా నిలిచి, గ్రామీణ విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తూ ఆర్.వీ.ఆర్.గా పేరొందిన ఆర్.వెంకటేశ్వరరావును డాక్టర్ ఆఫ్ లెటర్స్(డీలిట్) అవార్డును ఇచ్చి సత్కరించారు. గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ, గీతం అదనపు ఉప కులపతులు ప్రొఫెసర్ వై.గౌతంరావు, ప్రొఫెసర్ డీఎస్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, పాలక మండలి సభ్యులు, కేఎస్ పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'సిగాచి'ని సందర్శించిన ఏపీ ఫైర్ సేఫ్టీ డీజీ



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న ప్రతాప్

పటాన్‌చెరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమలో భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. కాగా శనివారం ఏపీ ఫైర్ సేఫ్టీ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ పరిశ్రమను సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, మృతుల వివరాలు, అగ్నిమాపకశాఖ పాత్ర తదితర అంశాలను కూలంకషంగా పరిశీలించారు. ఇటువంటి పెద్ద ప్రమాదాలు సంభవించకుండా అగ్నిమాపకశాఖ పారిశ్రామికవేత్తలను అప్రమత్తం చేసే విధంగా ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. పరిశ్రమ యాజమాన్యం, సిబ్బంది, సంఘటనా స్థలంలో ఉన్న పలువురు కార్మికులతో ఆయన మాట్లాడారు. ఈ ప్రమాదంలో ప్రభుత్వం, అధికారులు చాలా వేగంగా సహాయక చర్యలు చేపట్టి గాయపడ్డ వారికి హుటాహుటిన వైద్యసేవలందించడం హర్షించదగ్గ విషయం అన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై రాష్ట్ర బృందం ఆరా

సంగారెడ్డి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్(టాస్), ఉల్లాస్(వయోజన విద్య) ప్రవేశాల పరిశీలనలో భాగంగా శనివారం రాష్ట్ర బృందం సంగారెడ్డి జిల్లాలో పర్యటించింది. సభ్యులు గీత, క్రాంతి జిల్లాలోని వివిధ శాఖ అధికారులను కలిసి అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మాధురి చేతులమీదుగా ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామితో కలిసి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై చర్చించారు.



మార్కెట్‌కు తరలించడానికి పాలకూరను కోస్తున్న రైతు కుటుంబం

ఏ ఊరి సంతలోనైనా..

ఈ ఊరి కూరగాయలే..!

సండే స్పెషల్ Sunday Special

మహాదేవ్‌పల్లి స్పెషల్

- తరతరాలుగా కూరగాయల సాగు
- నాలుగు జిల్లాల వారాంతపు సంతల్లో విక్రయం
- ఒకప్పుడు శుభకార్యాలంటే ఇక్కడికి రావాల్సిందే
- ఉల్లినారులో తెలంగాణలోనే టాప్

కల్హేర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-అకోల 161వ జాతీయ రహదారిని ఆనుకున్న ఉన్న మహాదేవపల్లి కల్హేర్ మండల పరిధిలో ఉంది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతంలో పచ్చని అందాలు పరుచుకుని కనిపించే ఈ పల్లె ప్రకృతి అందాలకు నిలయం. ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతం కావడంతో ఇక్కడి బోర్లలో ఎప్పుడూ పుష్కలంగా నీరుంటుంది. భూగర్భజలాలూ అంతే. ప్రకృతి అందించిన ఈ సంపదను గ్రామస్థులు చక్కగా వినియోగించుకుంటున్నారు. ఏళ్లుగా ఇక్కడి వారు సంప్రదాయ పంటల వైపు మొగ్గు చూపకుండా కూరగాయలు.. ఇతర వాణిజ్య పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఫుల్ డిమాండ్..

మహాదేవ్‌పల్లిలో పండించిన కూరగాయలకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. గ్రామంలో సుమారు 500 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తారు. కూరగాయలు పండని భూముల్లో వరిసాగు చేస్తారు. మిగితా భూములన్నీ కూరగాయల పంటలే కనిపిస్తాయి. రైతులు విత్తనాలు కొనుగోలు చేయడం నుంచి, పంట పండించే సమయంలో వాటికి చీడపీడలు పట్టకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టడం వంటివి చేస్తుంటారు. పండించే కూరగాయలను సంగారెడ్డి, మెదక్‌తోపాటు నిజామాబాద్, కామారెడ్డి.. అలాగే, సరిహద్దులోనే ఉన్న మహారాష్ట్రలోని దేగ్లూర్, నాందేడ్ కర్నాటకలోని బీదర్ వరకు ఇక్కడి రైతులు తీసుకువెళ్తారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జోగిపేట, రాయికోడ్, రాయిపల్లి, న్యాల్‌కల్, బాచేపల్లి, నిజాంపేట, మనూర్, కరస్‌గుత్తి, కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, వట్‌పల్లి, తడ్కల్, మెదక్ జిల్లాలో పెద్దశంకరంపేట, నార్సింగి, బొడ్మట్‌పల్లి, రేగోడ్, పోచారం, పాపన్నపేట, మెదక్, కొల్చారం, వెల్దుర్తి, రామాయంపేట, చేగుంట, కామారెడ్డి జిల్లాలో పిట్లం, బాన్సువాడ, బిచ్కుంద, జుక్కల్, పెద్ద కొడప్‌గల్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, ఎల్లారెడ్డి, గోపాల్‌పేట్, లింగంపేట్, వర్ని, బీర్కూర్, పోతంగల్, కోటగిరి తదితర వారాంతపు సంతల్లో కచ్చితంగా ఈ గ్రామ రైతులు కూరగాయలు విక్రయిస్తారు. ఇప్పుడు హైబ్రిడ్ కూరగాయలు వస్తున్నా.. ఒకప్పుడు మహాదేవ్‌పల్లి గ్రామ రైతులు పండించిన కూరగాయలు రానిదే అక్కడి వారాంతపు కూరగాయల సంత జరిగేది కాదంటే అతిశయోక్తి కాదు. అలాగే, ఒకప్పుడు పరిసర గ్రామాల్లో దగ్గరగా ఉన్న జిల్లా కేంద్రాల్లో ఎక్కడ శుభకార్యం జరిగినా కూరగాయల కోసం ఈ గ్రామానికి వచ్చేవారు.

ముందు వరుసలో ఉల్లి నారు..

ఉల్లి నారు పెంచి విక్రయించడంలో ఈ గ్రామ రైతులు తెలంగాణాలోనే ముందు వరుసలో ఉంటారు. ప్రతి సీజన్‌లో గ్రామంలోని ప్రతి రైతు ఎన్ని పనులు ఉన్నా.. ఉల్లినారు వేసి విక్రయిస్తారు. కూరగాయలతోపాటు ఉల్లి, మిరపనారు విక్రయించి అదనపు లాభాలు గడిస్తున్నారు. మహిళలు కూరగాయల సాగులో మగవారికి తోడుగా ఉంటూనే దగ్గరి మార్కెట్లల్లో విక్రయించేందుకు వెళ్తారు. రైతులు తాము పండించిన పంటలను ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో తీసుకెళ్తారు. సీజన్‌తో పాటు అన్‌సీజన్‌లో ఎలాంటి కూరగాయలు సాగుచేస్తే లాభాలు వస్తాయో చూసి అలాంటి కూరగాయలే సాగుచేస్తారు. ఇక ఎక్కువమంది రైతులు పాలకూర, మెంతికూర, కొత్తిమీర వంటివి సాగు చేస్తారు.





మహాదేవ్‌పల్లి శివారులో సాగు చేస్తున్న మెంతి కూర, కామారెడ్డి జిల్లా పిట్లం మార్కెట్‌లో విక్రయిస్తున్న ఉల్లి, మిరప నారు విక్రయిస్తున్న మహాదేవ్‌పల్లి రైతులు

40 ఏళ్లుగా సాగు చేస్తున్నా..



నేను 40 ఏళ్లుగా కూరగాయల సాగుచేసి, విక్రయిస్తున్నా.. ఒకప్పుడు కూరగాయలు తలపై పెట్టుకుని వెళ్లి అమ్మేవాడిని, ప్రస్తుతం చిన్న వాహనంపై వెళ్తున్నా. వారాంతపు సంతల్లో కూరగాయలు అమ్ముతున్నా. కూరగాయలు అమ్మే నా పిల్లలను పెద్దవారిని చేశా. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు లాభాలు తగ్గాయి.

\- నీరుడి పరశురాం, రైతు, మహాదేవ్‌పల్లి

కుటుంబమంతా కూరగాయల సాగే..



మా కుటుంబం మొత్తం కూరగాయలే సాగుచేస్తాం. మాకున్న భూమిలో 50 శాతం పాలకూర, మెంతికూర, కొత్తిమీర సాగుచేస్తాం. అన్ సీజన్‌లో పండించే కూరగాయలకు అధిక లాభాలు వస్తాయి. గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తే, కూరగాయల రవాణాకు అనుకూలంగా ఉంటుంది.

\- మాటూరి రాజుగౌడ్, రైతు, మహాదేవ్‌పల్లి

పోటీ పెరిగింది..



మా కుటుంబం చాలా ఏళ్లుగా కూరగాయలు పండిస్తోంది. గతంలో రైతులు పండించిన కూరగాయలే మార్కెట్లకు వచ్చేవి. ఇప్పుడు దళారులు కూడా ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువస్తున్నారు. దీంతో పోటీ పెరిగింది.

\- పెంటబోయిన నాగమణి, మహిళా రైతు, మహాదేవ్‌పల్లి

30 ఏళ్లుగా ఇదే పని..



నేను 30 ఏళ్లుగా కూరగాయలు పండించి, అమ్ముతున్నాను. గ్రామంలో వరితో పాటు కూరగాయలు పండిస్తాం. వారంతపు సంతల్లో మహాదేవ్‌పల్లి గ్రామ రైతులు పండించిన కూరగాయలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడుతారు.

\- చింతకాయల సాయమ్మ, మహిళా రైతు, మహాదేవ్‌పల్లి

పీఏసీఎస్‌లో కాంప్లెక్స్ ఎరువుల కొరత

- ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలే దిక్కు
- బస్తాకు రూ.50 అదనంగా వడ్డింపు
- రైతులకు ఖర్చు తడిసి మోపెడు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కాశీపూర్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో శనివారం నిల్వ ఉంచిన కాంప్లెక్స్ ఎరువులు, ఆదేరోజు కంది పీఏసీఎస్ వద్ద కాంప్లెక్స్ ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

కంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాకు కూతవేటు దూరంలోని కంది పీఏసీఎస్‌లో గత కొన్ని రోజులగా బహుళ పోషకాలున్న కాంప్లెక్స్ ఎరువుల కొరత రైతులను వేధిస్తున్నది. ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో రూ.50 బస్తాకు అదనంగా చెల్లించి కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. పీఏసీఎ్‌సలో సిబ్బంది సకాలంలో డీడీలు చెల్లించినప్పటికీ డీలర్లు మాత్రం ప్రైవేటు దుకాణాలకే మక్కువ చూపుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఎరువులను ఎక్కువగా ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలకే సరఫరా చేస్తున్నారు. పీఏసీఎస్‌లో ఒక్క బస్తాకు రూ.1300లకు విక్రయించే డీఏపీ, 20-20 వంటి కాంప్లెక్స్ ఎరువులు దొరకకపోవడంతో రైతులంతా అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాశీపూర్‌కు బాటపట్టారు. ఇదే అదనుగా భావించిన అక్కడి ఫర్టిలైజర్ దుకాణదారులు 50 కేజీల ఒక్క బస్తాకు రూ.50 అదనంగా వేసి రూ.1350 ధరకు విక్రయిస్తున్నారు. అధికారులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు కుమ్మక్కై పీఏసీఎస్‌కు ఉద్దేశపూర్వకంగానే కాంప్లెక్స్ ఎరువులను సరఫరా చేయడం లేదని రైతులుఆరోపిస్తున్నారు. గతంలో పీఏసీఎస్ ద్వారానే మొత్తం ఎరువుల విక్రయాలు జరిగేవని, ఇప్పుడు కొత్తగా ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పడి తమను దోచుకుంటున్నారని వాపోతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏడీఏ వెంకటలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వెంటనే తాము సంబంధిత వ్యవసాయ అధికారులతో విచారణ జరుపుతామన్నారు.

బస్తాకు అదనం రూ.50 ..ఆటోకు రూ.600



కంది పీఏసీఎస్‌లో సకాలంలో కాంప్లెక్స్ ఎరువులు దొరకక కాశీపూర్‌లో ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణంలో బస్తాకు రూ.50 అదనంగా చెల్లించి 5బస్తాల 20-20 కొన్నాను. ఇక్కడి రావాలంటే ఆటో కిరాయి అదనంగా మరో రూ600 ఖర్చయింది. వ్యవసాయ అధికారులు పట్టించుకుని పీఏసీఎస్‌లో ఎరువులు స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. పీఏసీఎస్‌లో లేని స్టాక్ ప్రైవేటు దుకాణాల్లో ఎలా ఉంటుంది.

- మల్లెపల్లి కృష్ణ, కంది రైతు

రైతులకు అడుగడునా నష్టమే



మా ఊరి నుంచి ఐదుగురు రైతులం కలిసి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంది పీఏసీఎ్‌సకు వచ్చాం. ఇక్కడ కాంపెక్స్ ఎరువులు లేవని చెప్పడంలో కాశీపూర్‌కు వచ్చాం. ఇక్కడ బస్తాకు రూ.50 ఎక్కువ ఇచ్చి కొనుగోలు చేశాం. ఎక్కడ చూసినా మా రైతులకు నష్టమే తప్ప లాభం కానరావట్లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రైవేటు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి.

-కిష్టయ్య, చెర్లగూడెం రైతు

న్యూస్ బాక్స్

హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు శుభాకాంక్షలు

తూప్రాన్, జూలై 19: (ఆంధ్రజ్యోతి): హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ ఏకేసింగ్‌కు తూప్రాన్ మండల కిష్టాపూర్‌కు చెందిన హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కాలేరు నరేష్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయగానే మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

శివంపేట పాఠశాలను బాగు చేయండి

పుల్‌కల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శివంపేట ప్రాథమిక పాఠశాలను బాగు చేయాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి కోరారు. ఈ మేరకు శనివారం ఆమె గ్రామ శివారులోని చార్మినార్ బీరు (ఏబీఇఎన్‌బెవ్) పరిశ్రమ యాజమాన్యానికి వినతిపత్రం అందించారు.

కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయాలి

నర్సాపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాలకు నీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందచేసినట్లు కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవులరాజిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి రిజర్వాయర్ నుండి నియోజకవర్గంలోని హల్దీవాగు ద్వారా వెల్దుర్తి, వెసాయిపేట, కొల్చారం మండలాలకు అదే విధంగా సింగూరు రిజర్వాయర్ నుంచి కొల్చారం మండలంలోని సాగు భూములకు నీటిని విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న రాజిరెడి

బారికేడ్లు తొలగించి రాంగ్‌సైడ్ ప్రయాణాలు

రామచంద్రాపురం, జులై 19 (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉస్మాన్‌నగర్‌లోని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ వద్ద ఉన్న ట్రాఫిక్ ఐలాండ్ వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఓ వైపు రోడ్డును బారి కేడ్లతో మూసివేశారు. గతంలో ఇక్కడ ఓ వ్యక్తి మృత్యువాత పడటంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాని ఇక్కడ బారి కేడ్లను తొలగించి ప్రయాణికులు వ్యతిరేక దిశలో ప్రయాణాలు సాగిస్తున్నారు. చిన్న వాహనాలతో పాటు భారీవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం బారికేడ్ల మధ్యలోంచి వెళ్లామనుకున్న కారు వ్యతిరేక దిశలో డివైడర్ ఎక్కించింది. ఇక్కడ సెల్లార్ పనులు చేస్తున్న ఓ సంస్థ టిప్పర్లు కూడా ఓవర్‌లోడ్‌తో బారికేడ్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైన పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

చిన్నశంకరంపేట, జులై 19 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. విద్యార్థులు పోలింగ్ అధికారులుగా,సిబ్బందిగా విధులను నిర్వర్తించారు. మరికొందరు ఓటు వేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఎన్నికల పట్ల అవగాహన కల్పించడానికి మాక్ పోలింగ్ ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ వాణి తెలిపారు.

రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్,జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో రేషన్‌కార్డుల పంపిణీ, పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మకమిటీ ప్రమాణ స్వీకారం, సెట్విన్ కార్యాలయంలో శిక్షణను పూర్తిచేసుకున్న పలువురికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వహయాంలోనే రేషన్‌కార్డులు వచ్చాయని, మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే అర్హులైన నిరుపేదలకు రేషన్‌కార్డులను అందజేస్తున్నామని గుర్తు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి, జహీరాబాద్, మండలాల్లో 3,332 కొత్తరేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ఆత్మకమిటీ ఆధ్వర్యంలో రైతుల ప్రయోజనార్థం మరిన్ని కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అందులో భాగంగ కోహీర్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రామలింగారెడ్డి జహీరాబాద్ ఆత్మకమిటీ చైర్మన్‌గా ఆయనతో పాటు పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయా కారక్రమాల్లో ఆర్డీవో రాంరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి బాన రోజ, తహసీల్దార్లు దశరత్, ప్రభులు, ఏడీఏ భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాగా జహీరాబాద్ పట్టణంలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుచేయాలని నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా శనివారం ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ మంత్రి డా.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నారాయణఖేడ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యువజన కాంగ్రెస్ కార్యకర్తలదే అని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కార్యకర్తల కృషితోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటే విధంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యాంచరణ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు నాగార్జున, జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు సిద్దారెడ్డి, మండలాల బాధ్యులు ఉన్నారు.



ఖేడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో పలువురు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన నివాస గృహంలో అందించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ స్వగృహంలో 14 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్‌లు అందించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మెదక్ ఎమ్మెల్యే



పాపన్నపేట: అర్కెల గ్రామంలో లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్/హవేళిఘణపూర్/పాపన్నపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్దిదారులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మెదక్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని శనివారం రోహిత్‌రావు, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పేదలందరికీ విడతల వారీగా ఇళ్లను నిర్మించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ చంద్రపాల్, నాయకులు బొజ్జ పవన్, మధుసూదన్, హౌజింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హవేళీఘణపూర్ మండలకేంద్రంలోని రైతువేదికలో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, నాయకులు తదితరులు పాల్గొన్నారు. పాపన్నపేట మండల పరిధి అర్కెల గ్రామంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.33 కొత్త రేషన్ కార్డులు, 102 కార్డులలో కొత్తగా నమోదైన కుటుంబ సభ్యుల రేషన్ కార్డులను పంపిణీ చేశారు. . కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడుమల్లేశం గౌడ్

మెదక్ అర్బన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశంగౌడ్ పేర్కొన్నారు. దుండిగల్ నుంచి మెదక్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి మంజూరైన సందర్భంగా శనివారం స్థానిక రాందాస్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ, ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఎంపీ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మెదక్ పట్టణానికి రింగ్ రోడ్డు తోపాటు మెదక్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారికి కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్లు మంజూరు చేసిన ఎంపీకి జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పోతనపల్లి పాఠశాలలో అదనపు కలెక్టర్ తనిఖీ



పాఠశాలలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

మాసాయిపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి చెట్ల తిమ్మాయిపల్లి పాఠశాలను మెదక్ అదనపు కలెక్టర్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల హాజరు తదితర వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

మనోహరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని మెదక్ డీఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, కార్యాదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, గ్రామాల్లో వనమహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. గ్రామాలలో సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రవిందర్, డిప్యూటి ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో ఆదినారాయణ, కార్యదర్శులు, టీఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మత కార్యకలాపాలకు తావులేదు

హవేళిఘణపూర్, జులై19;(ఆంధ్రజ్యోతి); భారత రాజ్యాంగా భావజాలానికి విరుద్ధంగా విద్యాలయాల్లో మత ప్రచారాల కార్యకలాపాలకు తావులేదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని బూర్గుపల్లి ఉన్నత పాఠశాల్లో గిరిజన ఉపాధ్యాయుడు నరేందర్ నాయక్‌పై దాడికి పాల్పడిన వివరాలను తెలుసుకొని మాట్లాడారు. బడుల్లో బీజేవైఎం నాయకులు చేసిన చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ నాయకులు శంకర్, దయాసాగర్, వివిధ సంఘాల నాయకులు ప్రకాష్ రాథోడ్, రాధాకృష్ణ, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

హవేళిఘణపూర్, జులై19;(ఆంధ్రజ్యోతి); భూభారతి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి సూచించారు. శనివారం మండలంలోని తసీల్దార్ కార్యాలయాన్ని ఆమె రికార్డులను పరిశీలించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పనులను సమీక్షించి, రైతులకు నోటీసులు జారీ చేయడం గూర్చి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వెంట తసీల్దార్ సింధురేణుక, సర్వేయర్ రమేష్, సిబ్బంది తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

హత్నూర, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినట్లు తహసీల్దార్ ఫర్హీన్ షేక్ తెలిపారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో సుమారు 20రోజుల పాటు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై విచారణ చేస్తున్నామన్నారు. వ్యవసాయతర భూములకు ఆన్‌లైన్‌లో జరిగిన తప్పిదాల వల్ల రైతు భరోసా వచ్చినట్లు గుర్తించి వాటిని వెంటనే నిలిపి వేయించి.. ఆన్‌లైన్ జరిగిన తప్పిదాలను సరి చేసినట్లు స్పష్టం చేశారు.

నూతన చర్చి నిర్మాణానికి విరాళం

మునిపల్లి, జులై19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న చెల్మెడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు రుద్ర క్రిష్ణ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి విరాళాన్ని అందించారు. శనివారం ఆయన తనవంతుగా రూ.50వేలను చర్చి నిర్వాహకులకు అందజేశారు.



సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల నుంచి బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు



జహీరాబాద్‌లోని అల్లీపూర్‌లోగల శ్రీక్రిష్ణవేణి పాఠశాలలో బోనాల ఉత్సవాల్లో వివిధ వేషధారణలో విద్యార్థులు

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మెదక్ జిల్లాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలతో ఊరేగింపులు నిర్వహించారు. ఊరేగింపులో విద్యార్థినులు శివసత్తు వేషధారణలో పూనకాలతో ఆకట్టుకోగా, విద్యార్థులు పోతరాజుల వేషధారణలో చేసిన విన్యాసాలు చూపరులను అలరించాయి. ఊరేగింపు అనంతరం సమీపంలోని అమ్మవార్ల ఆలయాల్లో బోనాలను అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో నివేదించారు. ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌నెట్‌వర్క్, జూలై 19(ఆంధ్రజ్యోతి)



నర్సాపూర్: హైస్కూల్‌లో విద్యార్థుల బోనాల ఉత్సవాలు



చేగుంట మండలం బోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆషాఢ బోనాల వేడుకల్లో విద్యార్థులు

ర్యాగింగ్ భూతాన్ని తరిమేద్దాం



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహనలో మాట్లాడుతున్న జడ్జి

నర్సాపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే ర్యాగింగ్ భూతాన్ని కాలేజీల నుండి పూర్తిగా తరిమేద్దామని నర్సాపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమలత పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ నేతృత్వంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమంలో జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే ఉన్న కఠిన చర్యలపై అవగాహన లేక సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతూ జూనియర్లను ఇబ్బందులు పెడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ర్యాగింగ్‌కు దూరంగా స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలనే ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదెప్ప, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సురేష్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎద్దుమైలారంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

కంది, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కంది మండలపరిధిలోని ఎద్దుమైలారంలో శనివారం సంగారెడ్డి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే అధికారి అశోక్ నేతృత్వంలో గ్రామంలోని అన్ని మురుగుకాల్వల శుభ్రత, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, మసీదు, ఆలయాల ప్రాంగణాల్లో పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి తడి-పొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హాజరులో అవకతవకలు జరిగితే చర్యలు

- ఫీల్డ్ అసిస్టెంట్లకు డీఆర్డీవో పీడీ ఆదేశం

తూప్రాన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీల నేషనల్ మొబైల్ మానిటరీ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) హాజరు రెండు పర్యాయాలు కచ్చితంగా నమోదు చేయాలని డీఆర్డీవో ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నమనేని శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్ హాజరులో అవకతవకలు జరగొద్దని, తప్పులు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం తూప్రాన్ ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్పీ సీఈవో ఎల్లయ్య తో కలిసి నిర్వహించిన సమీక్షలో హాజరును ప్రతిరోజూ పంచాయతీ కార్యదర్శులు పరిశీలిస్తు 20శాతం హాజరు తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సతీష్‌పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చదువు సంస్కారం నేర్పుతుంది



పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ అందజేస్తున్న కౌడ శ్రీనివాస్‌గుప్తా

కౌడిపల్లి, జూలై(ఆంధ్రజ్యోతి) 19: చదువు సంస్కారం నేర్పుతుందని జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కౌడ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో పదోతరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు సిల్వర్ మోడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, మండల ఆదర్శ పాఠశాలల మండల అధ్యక్షురాలు రాధిక, విశ్రాంత ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, పుండరీకంగౌడ్‌తో పాటు విద్యార్థులు

వెంకటాపూర్ తండాలో కలుషిత నీరు సరఫరా

నిజాంపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాము మిషన్ భగీరథ నీటిని వాడమని తెగేసి చెప్పటంతో అధికారులు తండాకు నీటిసరఫరా పైపులైన్ తొలగించారు. అయితే బోర్‌నుంచి ట్యాంకులోకి వస్తున్న నీరు కలుషితమై బురద నీరు వస్తున్నదని నిజాంపేట మండలం వెంకటాపూర్ తండావాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో నీటిని వాడుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని లీకేజీని గుర్తించి నాణ్యమైన నీటి సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

చేగుంటలో 108 కలశాల ఊరేగింపు



చేగుంటలో మహంకాళీ ఆలయం వరకు కలశాలతో మహిళల ఊరేగింపు

చేగుంట జూలై 19 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల కేంద్రంలో మహంకాళి బోనాల జాతరలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహిళలు 108 కళశాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయం నుంచి మహంకాళి అమ్మవారి ఆలయం వరకు డప్పు చప్పుళ్ల మధ్య మంగళ హారతులతో కలశాల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని అభిషేకం చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల బాట పట్టిన విద్యార్థులు

పాపన్నపేట/చిన్నశంకరంపేట, జూలై 19(ఆంధ్రజ్యోతి): నోబ్యాగ్ డే అమలు సందర్భంగా విద్యార్థులు శనివారం ఉపాధ్యాయులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ఇందులో భాగంగా పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్ సందర్శించగా, పోలీసులు సాదరంగా ఆహ్వానించారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని విభాగాలు, వారి విధుల గురించి వివరించారు. పోలీస్ వ్యవస్థ సమాజం కోసం ఎలా పని చేస్తుంది.. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశం ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి, అధికారుల విధులు, బాధ్యతల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం దీప్లా రాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

నారాయణఖేడ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఖేడ్ మున్సిపల్ డ్రైవర్లు, వాటర్‌మెన్‌లు, ఆపరేటర్లు, కార్మికులు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. వేతనాలను పెంచడంతో పాటు జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచి తమపై పనిభారం తగ్గించాలని కోరారు. ధర్నా అనంతరం స్థానిక తహసీల్దార్ షాహీనాబేగంకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

40 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

నారాయణఖేడ్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గానికి చెందిన 40 మంది ఉచిత కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేయించుకొని శనివారం ఖేడ్‌కు చేరుకున్నారు. ఖేడ్ పట్టణంలోని సత్యసాయి ఆలయంలో గురువారం సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 76 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వారిని అదే రోజు ఉచిత వాహన సదుపాయాన్ని ఏర్పాటు చేసి నానక్‌రాంగూడలోని శంకర వైద్యశాలకి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించారు. ఉచిత వాహన సదుపాయాన్ని కల్పించి శనివారం వారిని ఖేడ్‌కు చేర్చారు.